
# మనిషితనం



'నవ్య' వారపత్రిక . . . 15 సెప్టెంబర్, 2004

అలారం మ్రోగించుకొంటూ అంబులెన్స్ వచ్చి ఆ ఆసుపత్రి ముందు ఆగింది.

అందులోని మనుషులు దిగి, డోర్ తెరిచి, లోపల స్ట్రెచర్ పైనున్న పసిపాపను స్ట్రెచర్‌తో పాటు దాదాపుగా పరిగెత్తుతూ తీసుకెళ్లారు. వెనకే సెలైన్ బాటిల్ పట్టుకొని ఒకరు, ఆక్సిజన్ సిలిండర్ పట్టుకొని మరొకరు ఫాలో అయ్యారు.

అందరి వెనుక ఓ పాతికేళ్ల అమ్మాయి ఆదుర్దాగా వాళ్ళ వెంట లోపలికి వెళ్లింది.

మెరూన్ రంగు ఛుడీదార్ ధరించివుంది ఆ అమ్మాయి. మనిషి చామనఛాయలో ఉన్నా- చక్కని కనుముక్కు తీరుతో, చాలా అందంగా ఉంది.

తిరుపతిలో మంచిపేరున్న ఆసుపత్రి అది! సమయం రాత్రి ఎనిమిది దాటినా మనుషులు అటూఇటూ తిరుగుతూనే ఉన్నారు. ఎమర్జెన్సీ వార్డు దగ్గర మరింత జనం ఉన్నారు. లోపల ట్రీట్‌మెంట్ పొందుతున్న తమ తాలూకు మనుషుల క్షేమం గురించిన ఆదుర్దా వాళ్ళ ముఖాల్లో కనిపిస్తోంది.

అరగంట తర్వాత పసిపాపతో లోపలికి వెళ్లినవాళ్ళందరూ బయటకి వచ్చారు- స్ట్రెచర్ తోసుకుంటూ. స్ట్రెచర్‌పై ఉన్న పాపకి ఆక్సిజన్, సెలైన్ ట్యూబులు తొలగించబడి ఉన్నాయి. వస్తున్నవాళ్ళలో అంతవరకూ ఉన్న టెన్షన్, భయం లేవు- ఏడుపు, బాధ ఉంది.

చివరగా... ఆ అమ్మాయి వచ్చింది. ఆమె ముఖం విచారంగా ఉంది.

అందరూ అంబులెన్స్‌లో ఎక్కారు... ఆ అమ్మాయి తప్ప!

ఆ అమ్మాయి అంబులెన్స్‌లో కూర్చున్నవాళ్ళతో ఏదో చెప్పింది.

అంబులెన్స్ కదిలింది.

ఆ పాప తల్లి రోదన క్రమక్రమంగా దూరమవసాగింది.

ఆ అమ్మాయి తను నిలబడిన చోటు నుంచి కదలలేదు. అరగంట గడిచింది. ఆ అమ్మాయి అక్కడే- అలాగే నిలబడివుంది. ఆమె ముఖంలో విచారం తగ్గలేదు.

కొంతసేపటికి ఆమె దగ్గరికి ఒకతను వచ్చాడు. ముప్ఫయ్యేళ్లు దాటివుంటాయి అతనికి. తెల్లని ప్యాంటుపై ఎఱ్ఱని టీషర్టు ధరించివున్నాడు. "శ్రీకాళహస్తి నుంచి వచ్చిన డాక్టరు మీరేనా..?" అని అడిగాడు ఆమెని.

ఆమె 'అవు'నన్నట్లు తలూపి, ఆసక్తిగా చూసింది- అతనేం చెబుతాడో వినాలని.

"నేను ఈ హాస్పిటల్‌లో పనిచేస్తున్నాను" అన్నాడు.

"మీరూ డాక్టరా..?"

"కాదు... అడ్మినిస్ట్రేషన్ సైడ్! ఆ పాపకి మొదట ట్రీట్‌మెంట్ చేసింది మీరేనా..?"

"అవును.. నేనే ఆపరేషన్ చేశాను. అయితే చాలా ఆలస్యంగా తీసుకొచ్చారు నా దగ్గరికి. పరిస్థితి చాలా క్రిటికల్‌గా ఉండింది. ఆ పాపకు ఏదైనా అయితే నన్ను బాధ్యురాలిని చేస్తారేమోనన్న భయం నాకున్నా, అంతకన్నా ముందు ఆ పాపను బ్రతికించడానికి మనిషిగా నా ప్రయత్నం చేయాలన్న తపనతో ఆపరేషన్ చేయడానికి ఒప్పుకున్నాను. కాని, పరిస్థితి మరింత దిగజారింది ఆపరేషన్ చేశాక. ఇక ఆశ లేదనీ, ఇక్కడికి పిలుచుకువచ్చినా ఫలితం ఉండదనీ నేను చెప్పాను. అయినా... తల్లి కాబట్టి బిడ్డ బ్రతుకుందేమో అన్న ఆశతో ఇక్కడికి తెచ్చారు... ఫలితం దక్కలేదు."

ఆమె ఎవరితోనైనా తన మనసు విప్పి చెప్పుకోవడానికే ఎదురుచూస్తున్నట్లు అతను అడగగానే గబగబా జరిగిందంతా చెప్పింది.

"అవును. హాస్పిటల్‌లోనూ డాక్టర్లు అదే అనుకుంటున్నారు. మీరు వయసులో చిన్నవారైనా ఆ పాప ప్రాణం కాపాడటం కోసం రిస్కు తీసుకొని ఆపరేషన్ చేశారనీ, మరో డాక్టర్ అయితే అసలు అడ్మిట్ కూడా చేసుకునేవారు కారనీ మిమ్మల్ని మెచ్చుకున్నారు" అన్నాడతను.

ఆమె కళ్ళల్లో ఒక్క క్షణం పాటు వెలుగు కనిపించింది అతనికి.

"మీరెందుకు వాళ్ళతోపాటు వెళ్లలేదు?" అని అడిగాడు ఆమెని.

"ధైర్యం లేక! వాళ్ళు పెద్దగా చదువుకున్నవాళ్ళు కాదు. గొడవలు చేసే రకం కూడా! వాళ్ళ పాపను నేనే చంపేశానని అంటారేమోనన్న భయం నాకుంది. అందుకే వాళ్ళతో వెళ్లలేదు. పైగా- ఈ విషయం విని ఊరివాళ్ళంతా నన్ను ఓ హంతకురాలిని చూసినట్లు చూస్తారేమోనన్న భయం మరోవైపు. అందుకే ఇక ఆ ఊరికి వెళ్లాలనిలేదు నాకు."

"వెళ్లక ఏం చేస్తారు? ఎన్నాళ్లు వెళ్లకుండా ఉండగలరు?"

"అవేవీ ఆలోచించడం లేదు నేను. ఏం చేయాలో తోచడం లేదు" అంది- కళ్ళనీళ్లతో.

"మీరు ఇంత సెన్సిటివ్ అయితే డాక్టరు వృత్తి ఎలా చేయగలరు? పదండి... అలా వెళ్లి కాఫీ తాగొద్దాం."

"నాకిప్పుడు తాగాలని లేదు."

"ఫర్వాలేదు... రండి! ఎప్పుడు తిన్నారో, ఏమో... అద్దంలో ఓసారి మీ ముఖం చూసుకున్నారంటే మీరెంత అలసిపోయి ఉన్నారో తెలుస్తుంది. పదండి... ఎదురుగా మంచి హోటల్ ఉంది" అంటూ కదిలాడు.

ఆమె మరేం మాట్లాడకుండా అతన్ని అనుసరించింది.

హోటల్‌లో ఖాళీ టేబుల్ ముందు ఎదురెదురుగా కూర్చున్నారు.

అతడు సర్వర్‌ని పిలిచి రెండు ప్లేట్లు చపాతీలు, తర్వాత కాఫీలు తెమ్మని చెప్పాడు. తర్వాత ఆమె వైపు తిరిగి-

"మీరు ప్రాక్టీస్ పెట్టి ఎన్నేళ్లయ్యింది?" అని అడిగాడు.

"రెండేళ్లు!"

"మరి, కొత్తగా ప్రాక్టీసు పెట్టిన డాక్టరులా అంత భయపడుతున్నారేమిటి?"

"ఇది నా ఫస్ట్ ఫెయిల్యూర్ కేస్! పైగా- నేను సర్జరీ చేసిన మొదటి కేసు. ఆ పాప తాలూకు మనుషులు బాగా డబ్బున్నవాళ్ళు. ఎంత మంచివాళ్లో అంత మూర్ఖులు కూడా. వాళ్ళు ఈపాటికి నా క్లినిక్‌పై దాడి చేసివున్నా ఆశ్చర్యపోనక్కరలేదు!" ఈ మాట అంటున్నప్పుడు ఆమె కళ్ళలో భయం కనిపించింది అతనికి.

"మీరు అన్నీ నెగిటివ్‌గానే ఎందుకు ఆలోచిస్తారు? పాజిటివ్‌గా ఆలోచించడం అలవాటు చేసుకోండి!"

కాఫీ తాగాక ఆమె వద్దంటున్నా వినకుండా తనే బిల్లు చెల్లించాడు అతను. కడుపులో ఆహారం పడేసరికి అంతవరకూ వున్న నీరసం మాయమైంది ఆమెలో.

హోటల్ బయటకొచ్చాక అడిగాడు అతడు-

"మీ అమ్మానాన్నలు మీతో ఉండడం లేదా?"

"వాళ్ళు శ్రీకాళహస్తి దగ్గర్లోని ఓ పల్లెలో ఉంటున్నారు. నేను ఒంటరిగానే ఉంటున్నాను. నా క్లినిక్‌లో పనిచేసే జలజ అనే అమ్మాయి నాతోపాటు మా ఇంట్లోనే ఉంటుంది.

"నేను మీకో సలహా ఇస్తాను... వింటారా?"

"చెప్పండి..."

"మీరు వెంటనే బయలుదేరి మీ ఊరు వెళ్లిపోండి! పదిన్నర అవుతోంది టైమిప్పుడు! మీరు ఊరు చేరేసరికి పన్నెండు అవుతుంది. ఇంటికెళ్లి ఏమీ ఆలోచించకుండా నిద్రపోండి. రేపు ఉదయం నిద్రలేచాక అంతా నార్మల్‌గా అనిపిస్తుంది మీకు. ఈరోజు మీరు అనుభవించిన టెన్షన్, భయం, బాధ ఏవీ ఉండవు."

ఆమె ఒక్కక్షణం ఆలోచించి, 'అలాగే'నన్నట్టు తలూపింది.

ఇద్దరూ ఆటోస్టాండ్ వైపు నడిచారు.

"మీరు 'డేల్ కార్నేగి' రాసిన 'హౌ టు స్టాప్ వర్రీయింగ్ అండ్ స్టార్ట్ లివింగ్' పుస్తకాన్ని చదివారా?" అని ఆమెని అడిగాడు.

"లేదు..!"

అతను తన చేతిలోని పుస్తకాన్ని ఆమెకిచ్చాడు.

"చదవండి... మీకు చాలా ఉపయోగపడుతుంది. ఇది నా దృష్టిలో ఓ భగవద్గీత! వీలున్నప్పుడల్లా చదువుతుంటాను నేను."

"మరి, మీకు తిరిగి ఎలా ఇవ్వను?"

"ఆ పుస్తకం చివర నా అడ్రసుంది. మీరు చదవడం పూర్తయ్యాక ఆ అడ్రసుకి కొరియర్‌లో పంపించండి."

"థాంక్యూ..." అంది కృతజ్ఞతగా.

పుస్తకం చివర అతని పేరు 'ప్రభాకర్' అని రాసివుండడం వీధిదీపాల వెలుగులో చూసి "నా పేరు భవాని" అంటూ హేండ్‌బ్యాగ్‌లోంచి తన విజిటింగ్ కార్డు తీసి అతనికిచ్చింది.

ఆమె ఆటోలో కూర్చున్నాక– అతను వంగి లోపలికి చూస్తూ "బీ బ్రేవ్! అంతా నార్మల్‌గానే ఉంటుంది. గాడ్ బ్లెస్ యూ!" అన్నాడు.

ఆమె అతని చేతిని అందుకుని, అతని ఆశ్చర్యాన్ని పట్టించుకోకుండా– "థాంక్యూ... థాంక్యూ ఫ్రెండ్!" అంది– కరచాలనం చేస్తూ.

ఆటో కదిలింది.

●

బస్‌స్టేషన్ వెలుపల భవాని ఆటో దిగగానే శ్రీకాళహస్తి వెళ్లే బస్సు బయటకి వస్తూ కనిపించింది.

వెంటనే బస్సుని ఆపి ఎక్కింది.

సీటులో కూర్చున్నాక 'తను క్లినిక్‌కి ఫోన్ చేసి జలజను బస్‌స్టేషన్‌కి రమ్మని చెప్పి ఉండాల్సింది... తను ఊరు చేరేటప్పటికి అర్ధరాత్రి అవుతుంది కదా!' అనుకొంది.

శ్రీకాళహస్తిలో బస్ దిగిన భవానికి ఎదురుగా ఆమె క్లినిక్‌లో పనిచేసే జలజ, రాజన్‌లు కనిపించారు.

"ఇదేమిటీ... ఈ టైములో మీరిక్కడ?" అని అడిగింది భయంగా చూస్తూ.

"మేమిద్దరం మీకోసం ఎదురుచూస్తూ క్లినిక్‌లోనే ఉండిపోయాం. ఇంతలో... మీ ఫ్రెండు ఒకరు ఫోన్ చేసి మీరు తిరుపతి నుంచి బయలుదేరారనీ, పన్నెండు గంటలకు ఊరు చేరవచ్చుననీ, మిమ్మల్ని ఇంటి దగ్గర దిగబెట్టమనీ చెప్పారు" అన్నాడు రాజన్.

"పేరు ఏం చెప్పారు..?"

"ప్రభాకర్ అని చెప్పారు."

ఆమెకు తను ప్రభాకర్‌కి విజిటింగ్ కార్డు ఇవ్వడం గుర్తొచ్చింది. అందులోని తన ఫోన్ నంబర్ చూసి క్లినిక్‌కి ఫోన్ చేశాడులా వుంది.

'హి ఈజ్ ఎ మేన్ ఆఫ్ కన్సర్న్' అనుకుంది మనసులో.

ఇంటికెళ్లి భోజనం చేసి పడుకుంది. ఆమె మనసులో ఇప్పుడు చనిపోయిన పాప గురించిన ఆలోచనలు లేవు. ప్రభాకర్ గురించే ఆలోచిస్తోంది.

'ప్రపంచంలో ఇంకా మానవత్వం ఉంది. ఎదుటిమనిషి గురించి పట్టించుకొనేవాళ్ళు, కన్నీరు తుడవడానికి ప్రయత్నించేవాళ్ళు ఇంకా ఉన్నారు' అనుకుంది.

కొద్దిసేపటికే అలసిన ఆమె శరీరానికి నిద్రపట్టింది.

●

మరుసటి రోజు ఆదివారం కాబట్టి ఆలస్యంగా నిద్రలేచింది భవాని.

'ప్రభాకర్ చెప్పినట్లే క్రితంరోజు ఉండిన భయం, అలసట ఇప్పుడు లేవు' అనుకుంది.

స్నానం చేసి క్లినిక్‌కి వెళ్లింది.

ఆమె ఊహించినట్లు ఆమె క్లినిక్‌పై ఎవరూ దాడి చేయలేదు. పాప తాలూకు బంధువులు వచ్చి 'ఆమె ప్రయత్నం ఆమె ధైర్యంగా చేసిందనీ, తమకు ప్రాప్తం లేకపోవడం వల్లే పాప తమకు దక్కలేదని, బాధపడవద్దనీ' చెప్పి వెళ్లారు.

సాయంత్రం క్లినిక్‌కి శెలవు కాబట్టి ప్రభాకర్ ఇచ్చిన పుస్తకాన్ని చదవడం మొదలుపెట్టింది.

రెండురోజుల్లో పుస్తకాన్ని పూర్తిచేసింది. ఆ పుస్తకం ఆమెకెంతో నచ్చింది. ఆ పుస్తకాన్ని తనకు ఇచ్చి చదవమని ప్రోత్సహించిన ప్రభాకర్‌కి మనసులోనే ధన్యవాదాలు చెప్పుకుంది. ఆ పుస్తకం కాపీ ఒకటి తన దగ్గరుంటే మంచిదని భావించి పబ్లిషర్స్ అడ్రసు నోట్ చేసుకుంది. 'రేపే వాళ్ళకు ఉత్తరం రాయాలి' అనుకుంది.

మరుసటి రోజు ఉదయం ఏడు గంటలకు ప్రభాకర్ ఇచ్చిన పుస్తకంలోని అతని ఫోన్ నంబర్ చూసి డయల్ చేసింది.

"హలో ప్రభాకర్‌గారి ఇల్లేనా..?" ఫోన్‌లో ఆడగొంతు విని అడిగింది.

"అవునండీ... ఆయన భార్యను మాట్లాడుతున్నాను. మీరు..?"

"శ్రీకాళహస్తి నుంచి డాక్టర్ భవాని!"

"అలాగా! ఆయన హాస్పిటల్‌కి వెళ్లారు."

"అప్పుడే డ్యూటీకి వెళ్లిపోయారా?"

"ఆయన పనిచేసేది ఇంజనీరింగ్ కాలేజీలో! వారి తల్లిగారు హాస్పిటల్‌లో అడ్మిట్ అయి వుండడంతో రోజూ వెళ్లి చూసుకునేవారు. ఆవిడ తెల్లవారుఝామున పోయారు. బాడీ తీసుకు రావడానికి వెళ్లారు."

నోట మాట రానట్టు నిలబడిపోయింది భవాని. వెంటనే తేరుకుని-

"ఐయామ్ సారీ! ఎలా పోయారు ఆవిడ?" అని అడిగింది.

"ఆస్త్మా పేషెంట్ ఆవిడ! వారంరోజులుగా హాస్పిటల్‌లోనే ఉంది. శనివారం సాయంత్రం నుంచి కోమాలోకి వెళ్లిపోయింది."

"ప్రభాకర్‌గారికి నా కండొలెన్సెస్ చెప్పండి. నేను తర్వాత ఫోన్ చేస్తాను" అని చెప్పి, ఫోన్ పెట్టేసింది.

అయితే... ప్రభాకర్ ఆ హాస్పిటల్‌లో పనిచేయడం లేదు. తల్లి కోమాలోకి వెళితే ఏం చేయాలో తోచక హాస్పిటల్‌లో అటూఇటూ తిరుగుతూ, బాధపడుతూ నిలబడివున్న తనని చూశాడు. జరిగింది తెలుసుకొని తనతో మాట్లాడటం కోసం 'హాస్పిటల్ స్టాఫ్' అని అబద్ధం చెప్పాడు. అక్కడి డాక్టర్లు తన గురించి గొప్పగా మాట్లాడుకుంటున్నారని మరో అబద్ధం చెప్పాడు. అలా చెబితే తనకు ఊరట కలుగుతుందని, ధైర్యం వస్తుందని ఎంతో గొప్పగా ఆలోచించి చెప్పాడు. నిజంగానే ఆ మాట తనకెంతో ధైర్యాన్నిచ్చింది.

పైగా... శనివారం సాయంత్రం నుంచి అతని తల్లి కోమాలోకి వెళ్లిపోయింది. ఆ సమయంలో అతని మానసిక పరిస్థితి ఎలావుంటుందో తను అర్థంచేసుకోగలదు. కాని, అతను తనను కలిసిందీ, ధైర్యం చెప్పిందీ ఆ శనివారం రోజు రాత్రే! మనసులో అంతటి బాధను ఉంచుకొని కూడా మరో మనిషిని పట్టించుకుని, ధైర్యం చెప్పిన అతని 'మనిషితనానికి' ఆమె మనసులోనే జోహార్లు అర్పించింది.

'ఆరోజు బాధలో వున్న తనకు అండగా వుండి ధైర్యం చెప్పిన అతను ఈరోజు బాధలో ఉన్నాడు. అతనికి ధైర్యం చెప్పడం ఇప్పుడు తన బాధ్యత! మనిషి సుఖాలలో ఉన్నప్పటికంటే బాధల్లో ఉన్నప్పుడే ఆప్తుల తోడు, ఓదార్పు అవసరం' అనుకొని, తిరుపతి వెళ్లడానికి నిశ్చయించుకుని సిద్ధమవసాగింది డాక్టర్ భవాని.

పాఠకుల కోసం, సాహితీప్రియుల కోసం

**జయంతి పబ్లికేషన్స్**

ప్రచురించిన పుస్తకాల గురించి క్లుప్తంగా వివరిస్తూ రూపొందించిన పూర్తి కేటలాగ్ కోసం మా అడ్రసుకి వ్రాసి ఉచితంగా పొందండి.